
# చీకటి కౌగిలి



## ఐ.వి. జెన్నిచందర్

**ఎవరో** నా షర్ట్ పట్టుకుని గుంజినట్లనిపించి చివ్వున వెనుదిరిగి చూశాను.

ఎవరో ఒక అపరిచిత యువతి చిలిపిగా, చిన్నగా నవ్వుతూ చూస్తూంది నా కేసి. గమ్మత్తుగా అని పించింది నాకు. ఆమె ప్రవర్తన అర్థం కానట్లు మొహంపెట్టాను.

"ఏయ్, మొద్దూ, ఇంకా నన్ను గుర్తుపట్లే...?" ఆమె చొరవగా ఏక వచన సంబోధనతో ప్రశ్నించింది నన్ను.

ఆమె ఎవరన్నది స్ఫురణకు తెచ్చుకోవటానికి ప్రయత్నించి జ్ఞాపక పుటల్ని ఒకమారు కెలికి వదిలాను. కాని ఆమె ఎవరన్నది అంతు చిక్కలేదు. పరీక్షగా ఆమె మొహంలో చూశాను. ఎక్కడో చూసీ చూడనట్లు ఆమెలో ఏవో పోలికలు నాకు సుపరిచితమని అస్పష్టంగా గొణుగుతుంది మనసు. అయినా—"సారీ, మీ రెవరో గుర్తు రావట్లేదు" అన్నాను నెమ్మదిగా.

అంతవరకు కొంటెగా, అల్లరిగా చూస్తున్న ఆమె కళ్ళలో ఒక్కమారుగా ఆశ్చర్యం తొంగి చూసింది.

నేను సందిగ్ధంలో పడ్డాను—ఎవరీమె—ఈమెకు నే నెవరో తెలియకుండా అంత చనువుగా నడి రోడ్డుపై నిలబెట్టి ఏకవచన ప్రయోగంతో పలకరించదే—కాస్త ఒత్తుగా—మెరుపు తీగెలా ఉన్న ఆమె సౌందర్య చిహ్నాలు నేను ఎక్కడో చూసినట్లు, నాకు ఆత్మీయమైనట్లు తోస్తుంది. కాని ఒక పట్టాన గుర్తు రావట్లేదు.

"నిజం చెప్పు—నీ పేరు....నా?" ఆమెలోని పరిపూర్ణమైన నమ్మకం, ఆత్మవిశ్వాసం ఆమెచేత ఆ ప్రశ్న వేయించినట్టుంది.

"అవును—నా పేరే" అన్నాను విలువునా ఆశ్చర్య పోతూ నేను. ఆమె పర్‌ఫెక్ట్‌గా నా పేరు కూడా చెప్పగలిగిందంటే ఆమెకు నే నెవరో బాగా తెలుసన్న మాట. నా జవాబు ఆమె మనసులో సంతృప్తిని, మొహంలో ఆనందరేఖల్ని విచ్చుకునేలా చేయ గలిగింది.

"ఇంకా గుర్తుపట్లే నన్ను—నేను శైలని—పాల కోసమని మీ ఇంటికి వస్తే పెరట్లోకి తీసుకుపోయి వూపిరాడ నివ్వకుండా ముద్దుల వర్షం కురిపించేవాడివే ఆ శైలని నేనే!" ఇంకా ఆమె ఏవేవో గుర్తుల్ని చెప్పుకు పోతూంది.

అంతే—నా మస్తిష్కంలో ట్యూబ్‌లైట్ గుప్పున

వెలిగింది. "ఓ, నువ్వా!" అన్నాను మొహంనిండా ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని నింపుకుంటూ.

"హమ్మయ్య! చాలు, ఇప్పటికైనా గుర్తుకు వచ్చాను." బరువుగా వూపిరి పీల్చి కొంగు అంచుతో మొహాన్ని ఒకమారు సున్నితంగా అద్దుకుంది.

"గుర్తుకు రావటమేమిటే—గుండె గూడులో ఇంతవరకు ఉంటున్నది నీవేగా!" మూలిగింది మనసు.


ఆమెలో కలిగిన శారీరక మార్పే గుర్తు దొరక్క నన్ను ఇన్ని తిప్పలు పెట్టింది. అప్పట్లో పరికిణీ, జాకెట్టు వేసుకొని తెల్లగా—సన్నగా—కుందనపు బొమ్మలా ఉండేది శైలం. అపరిపక్వమైన ఆ దశలో వయసు తొడుగుతున్న వసంత తొడుగులు ఆమె స్నిగ్ధ లావణ్యాలకి మెరుగులు దిద్దేవి. శైలని అప్పట్లో ఒంటరిగా చూస్తే చాలు, తనలో రక్తం ఉప్పొంగేది. ఆపుకోలేని ఉద్వేగంతో గుండె దడ దడ కొట్టుకొనేది.

మీకు శైలతో నా పరిచయం వివరించాలంటే కాస్త కాలాన్ని వెనక్కి—ఎనిమిది సంవత్సరాల వరకు కొలుస్తూపోతే...

భూషణంగారి ముద్దుల కూతురు శైలం. భూషణంగారు అప్పటి మా వూరికి ఉన్న ఒకే ఒక కేపిటలిస్ట్. అతడి మోచేతి క్రింద ఆ వూరు సలక్షణంగా జీవిస్తూందంటే అతిశయోక్తి మాత్రం కాదు. భూషణంగారు ఆశ్రిత జనాలు ఆయనవద్ద ఎంత మంచివాడని కీర్తించేవారో, బయట అంత దుర్మార్గుడని పొగిడేవారు.

మేము కూడా కాస్త స్థితిమంతులం కావటం వలన ఆ వూర్లో మా నాన్నగారికి వకీలుగా ఎంత పేరు ఉందో, భూషణంగారి వద్ద కూడా అంతే చనువు ఉండేది. భూషణంగారు, మా నాన్నగారు తీరిక వేళల్లో కాలక్షేపానికి చదరంగం ఆడేవాళ్ళు. వీళ్ళిద్దరి మిత్రత్వంవలన వారికి, మాకు ఒకరి ఇంటికి వేరొకరు రాకపోకలుండేవి. ఈ కారణాల వలన శైలకి, నాకు మధ్య సన్నిహితత్వం ఏర్పడింది. ఇద్దరం ఒకే ఈడు వాళ్ళం—ఒకే చదువువాళ్ళం కావటంతో మా చదువుతోపాటు స్నేహం కూడా చురుకుగా అభివృద్ధి పొందుతుండేది. వీధి బడిలో చదివేటప్పుడు రామనాథం మాస్టరుగారికి మేమిద్దరం చదువులో చురుకైన వాళ్ళమని నమ్మకం. వీధిబడి చదువు పూర్తయిన తరువాత వూరికి దూరంగా ఉన్న హైస్కూల్ చదువుకోసం ఇద్దరం ఎద్దుల బండిపై కలిసి వెళ్ళవలసి వచ్చింది. దారి పొడుగునా కోడెగిత్తల మెడలో మువ్వల శబ్దం మా కబుర్లకు లయబద్ధమైన సంగీతాన్ని సమకూర్చేది.

ఒక రోజు సోమిగాడి కొడుకు మాపై రాయి విసిరాడని వాడిని ఇద్దరం తోవ కాసి బలవంతంగా బురదలో పెట్టిన అల్లరి. సంక్రాంతి రోజు శైల తొడుక్కున్న పరికిణీ బావులేదన్నానని చేతిలో కాఫీ గ్లాసు నా మొహాన విసిరి చాక్లా చించేసిన అలక—సరదాగా సాయంత్రం వేళ ఏట్లో స్నానం చేస్తున్న శైల నగ్న సౌందర్యాన్ని ఏటి అంచునున్న చెట్టు కొమ్మల అంచుల్లోంచి, ఆకుల సందుల గుండా చూస్తున్నప్పుడు పట్టు జారి నీటిలో పడ్డ నా




చిలిపితనం, సిగ్గు లొలుకుతూ ఆడిసిన దేహంతో తన లేత వయసు అందాల్ని పదిలంగా దాచుకుంటూ పొద చాటుకు పారిపోయిన శైల కొన్ని దినాల వరకు కనిపించినప్పుడల్లా గుడ్లురుముతూ చూసే ఆ కళ్ళలోని కలికితనం—ఇవన్నీ మా ఇద్దరి మధురమైన చిన్ననాటి చిలిపి గుర్తులు.

ఒక రోజు—ఆ రోజు జరిగిన సంఘటన మరువలేని, మరువరానివ్వని దివ్య స్మృతి.

ఆ రోజు ఉగాది. గ్రామం సీమ నూతనోత్సాహంతో పులకరిస్తూంది. ఏ వాకిలి చూసినా కళామయంగా తీర్చి దిద్దిన రంగవల్లులతో, కన్నె పిల్లలా పరికిణీ, వోణీల రెపరెపలతో పల్లె ప్రజల మొహాల్లో వెల్లివిరుస్తున్న ఆనంద హాస రేఖలతో స్పందించే హృదయాలకి దృశ్య కావ్య ఆవిష్కరణ జరిగే రోజు—ఆ రోజు—

గుమ్మం ముందు కూర్చుని రవీంద్రుని 'శేష ప్రశ్న' చదువుతూ గేటు తెరిచిన చప్పుడుకి తలెత్తి చూశాను. ఎదురుగా కొత్త బట్టలతో శిరీష కుసుమంలా శైలం.

"అత్తయ్య ఉందా? పాలు పోయించుకోవాలి." సన్నని గొంతు మధురంగా ధ్వనించింది.

కావ్య లోకాల్లోంచి అప్పుడే, ఆ క్షణమే కదిలొచ్చిన యౌవనంలా శైలం. ఆమె పదహారు వసంతాల పసిమి సౌందర్యం నా హృదయ స్పందనకు జీవం పోస్తూ, నాలో ఏదో నే మాహించని అసంకల్పిత క్రియ జరుగుతూంది.

"ఏయ్! ఏమిటలాచూస్తావ్? దిష్టి తగులుతుంది." చిన్నగా గొణిగింది. శైల సిగ్గు పడుతున్న రెప్పలు బరువుగా వాలాయి.

'శైలా, పాలు పోస్తారా" అంటూ ఆమె చేయి పట్టుకుని పెరటి వైపు తీసుకు పోయాను. తనకేమీ అర్థంకాక నా వెంట నడిచి వచ్చింది శైలం.

ఇంట్లో వాళ్ళంతా కోవెలకు వెళ్ళటమే నా ధైర్యానికి ఒక విధమైన కారణమైంది. నిర్మానుష్యంగా ఉంది పెరడు. ఫెన్సింగ్ చుట్టూ దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలు మా ఉనికికి అడ్డు గోడ.

"పాలు పోయమంటే ఇక్కడకు తీసుకు వచ్చావేం?" బెదురు చూపులు చూస్తూ అడిగింది శైలం.

శైలా! నువ్వెంత అందంగా ఉంటావో తెలుసా!" నా స్వరం చిన్నగా వణికింది. గొంతులో తడి ఆరిపోతూంది.

"ఛీ! ఫో! ఆవేం మాటలు!" బుగ్గలు సిగ్గుతో ఎర్రబడ్డాయి.

"నిజం. శైలా నీ పెదవుల్లో, నీ బుగ్గల్లో, నీ కళ్ళలో ఎంత అందం ఉందో తెలుసా?"

"ఎంత!" గుస్సలా గుసగుసలు పోయిందా ముగ్ధ.

అంతే! ఆమెని మరి మాట్లాడనివ్వకుండా బలంగ నా కౌగిలిలో బిగించేశాను. కన్నెపిల్ల కౌగిలిలో వెచ్చదనం, పెదవుల్లో తియ్యదనం, బుగ్గల్లో కమ్మదనం అణువణువు స్పర్శించిన ప్రేయసి స్పర్శలో మెత్తదనం చవి చూసిన తొలి రోజు అది.

అప్పటి నుండి శైల ఒంటరిగా కనిపిస్తే చాలు, మృదువుగా కౌగిలిలో బంధించే వాడిని. అర విచ్చిన పెదవుల్ని ముని పళ్ళతో కొరికే వాడిని. చెంపలపై కెంపులు పూయిస్తుండే వాడిని. ఇలా రోజు రోజుకి మా మధ్య అనుబంధం చిగుళ్ళు తొడుగుతూ పెరుగుతూంది.

ఒక రోజు మేమెవరూ వూహించని వార్త వినవలసివచ్చింది. భూషణంగారిమనుష్యులు హరిజనులపై చేసిన దాడిలో ఎక్కువ శాతం హరిజనులు దారుణ మరణానికి గురి కావలసి వచ్చింది. ఒక వైపు గూడెం తగలబడి పోతుంటే, మరో వైపు భూషణంగారి మనుష్యులు అందిన వాడిని అందినట్లు నరుకుతుంటే, ఇంకో వైపు పసివాళ్ళు, వృద్ధులు అగ్ని జ్వాలల్లో చిక్కుకుని రోదిస్తుంటే, ఆ హరిజనుల ఆక్రోశాలకి అంతు లేకుండా పోయింది. మరుసటి రోజు భూషణంగారు మా నాన్నగారిని తన మీద నేరం రాకుండా వాదించమన్నారు. అంత క్రూరమైన నీచ ప్రవృత్తికి తను ఇంకా దిగజారలేదని, తనలో మానవత్వం నశించి పోలేదని నాన్నగారు నిర్మొహమాటంగా చెప్పేశారు. అప్పటినుండి వారికి, మాకు మధ్య రాకపోకలు నిలిచి పోయాయి. కొన్ని దినాల తరవాత హైస్కూల్ చదువు పూర్తి కావటంతో నేను కాలేజీ చదువుకై విశాఖకి వెళ్ళవలసి వచ్చింది. శైల మాత్రం ఇంటి పట్టునే ఉండిపోయింది. కొన్ని దినాల తరవాత మా కుటుంబంకూడా ఆ వూరి నుండి మకాం ఎత్తేసి విశాఖలో స్థిరపడి పోయారు.

నేను మధ్యలో ఒక మారు పల్లెకు పోయి శైలను చూడాలని అనుకున్నాను. కాని కారణాంతరాలవలన కుదరలేదు. బి. ఎ. పూర్తయిన తరవాత శైలని శాశ్వతంగా మా ఇంటికి తీసుకు వచ్చేద్దామని అనుకున్నాను. అది మా ఇరువురి నిర్ణయంకూడా. కాని నేను ఫైనల్ ఇయర్‌లో ఉండగానే నాన్నగారు కాలం చేయటంతో ఇంటి బాధ్యతలన్నీ నా నెత్తిన పడటం. ఆ బాధల్లోనే ఎగ్జామ్స్ పూర్తి చేయటం, తరువాత ఫస్ట్ క్లాస్

జాబ్‌చేస్తూ ప్రైవేటుగా ఎం.ఎ.కికట్టటం కుటుంబ పోషణకై ఉద్యోగం వేటలో పడటం—ఈ బాధలు, ఈ గొడవల వలన శైల నా వలువు మరల్లో బిగుసుకు పోయింది. అప్పుడప్పుడు క్షణ మాత్రం ఋర్తొచ్చినా మానసిక సంఘర్షణలో ఒక చేదు విజంలా మిగిలి పోతుండేది.

ఈ రోజు అకస్మాత్తుగా అనుకోని దర్శనం—మళ్ళీ శైల.

శైల నన్ను పట్టి పట్టి చూస్తూంది.

"శైలా! ఏం అలా చూస్తున్నావ్?" ఆప్యాయంతో నా గొంతు తడిసింది.

"నీ వేం మారలేదు. ఇప్పటికన్నా అప్పుడే వయసునిపిస్తుంది."

"అవును—బాధ్యతలే మార్పుకి గుర్తులు. కాని నీవు మాత్రం చాలా మారిపోయావ్ సుమా."

"వికై చూసి చూసి మారిపోక, ఒడిపోక తప్పుతుందా?" వాకేసి రోతుగా చూస్తూ అంది శైల.

తల వంచుకున్నాను. మాటలు ఈ వెలుగా గురి చూసి కొడుతూంది. తట్టుకునే చేవ లేదు ప్రస్తుతం.

"శైలా! ఒక మాట చెప్పనా! జరిగిన వన్నీ జరగని వాటికి చిహ్నలు మాత్రమే. నీవు నన్ను క్షమించినా క్షమించకపోయినా నే నేరస్థుణ్ణనే చెప్పుకుంటాను వాకు నేను. అదిసరే—నీవు ఈ వూరెప్పు డొచ్చావ్?"

"నేను షాపింగ్ కని బయలుదేరాను. అవునూ, నీకు తెలియదు కదూ! మేం ఈ వూరికివచ్చి మూడు సంవత్సరాలు కావస్తూంది. న్వెక్కడేం చేస్తున్నావ్? ఏ పిన్ ఉద్యోగం..."

"కాలేజీలో లెక్చరర్ జాబ్‌తో సరి పెట్టుకున్నాను. శైలా, అలా పార్క్‌కి వెళ్ళి కాసేపు కూర్చుందామా?"

"వద్దు—పద నా ఇంటికి పోదాం."

ఆటోలో ఇద్దరం ఇంటికి చేరుకున్నాం. తలుపు తాళం తీసి లోపలికి అడుగు పెట్టి స్విచ్ వేశాను. చీకటి పోయి వెలుగుతో విండింది గది.

"ఏమిట, ఇంట్లో ఎవరూ లేరేం?" గది అంతా కలియ తిరుగుతూ ప్రశ్నించింది శైల.

"తమ్ముడు ఎక్కౌంటెంటుగా గుంటూరులో ఉద్యోగం చేస్తున్నాడు. వాడి దగ్గరే ప్రస్తుతం అమ్మ ఉంటూంది. చెల్లెలు ఖరగ్‌పూర్‌లో కాపరం చేసుకుంటూంది."

"మరి నీ సంసారం?"


"నా సంసారం ఇందులోనే. ఇంటిలో ఉన్నదంతా నా సంసారమేగా!"

"కాని ఇది బ్రహ్మచారుల కొంపలా ఉందే..."

"మరి నే బ్రహ్మచారిని కాదని ఎవరన్నారు?"

నా సమాధానం పూర్తి కాకముందే కేన్ కుర్చీలోంచి దిగ్గున లేచి నిలుచుంది శైల. "నువ్వింకా పెళ్ళి చేసుకో లేదా!" ఆశ్చర్యం, ఆనందం నిండిన స్వరంతో ప్రశ్నించింది.

"ఆత్మతో ప్రేమించిన అమ్మాయిని అందుకో లేని అదృష్టహీనుణ్ణి. అందని దానిపై ఇంకా ఆశ చావని వాడిని. ఎవరిని ప్రేమించాలి? ఎవరిని పెళ్ళి చేసుకోవాలి? ఎవరితో సహజీవనం సాగించాలి?" తడిసిన గొంతుతో తడబడింది మనసు.



"నీవు నన్ను ఇంకా మరిచిపోలేదా..." మాటిగా హృదయంలోతుల్లోకి చూపులు గుచ్చింది శైల.

"మరిచిపోయానని నే అనలేదే." సోఫాలోంచి లేచి రేక్ లోంచి ఒక డైరీ తీసి, అందులోంచి ఒక ఫోటో ఆమె కందించాను.

చూసిన ఆమె కళ్ళు ఆశ్చర్యంతో వెడల్పయ్యాయి. కొన్నిక్షణాలు మౌనంగా ఉండిపోయింది ఆమె అంతర్యంలో ఏదో ప్రళయం ప్రాణం పోసుకుంటున్నట్లుంది. మోహంలో పెనుతుఫానులో చిక్కుకున్న చివురుటాకు వణుకు ప్రస్ఫుట మవుతూంది.

నేను నిశ్చలంగా, నిర్వేదంగా కూర్చున్నాను. నిశ్శబ్దాన్నే తింటున్న క్షణాలని నగల గొడుతూ శైల...

"అప్పుడప్పుడు నీ పేరుతో వస్తున్న కథలు, కవితలు చదవటం తటస్థించింది. నీ రాతల్లో గుండెలు పిండే వేదన వ్యక్తమవుతూంది. ప్రస్తుతం నీ సౌందర్యోపాసన, రచనా వ్యాసంగం ఎట్లా సాగుతున్నట్లు?"

"మానస కాగితంపై జీవితం చిరిగిన అక్షరమై నవ్వుతున్నప్పుడు అన్ని నవ్యంగా జరుగుతున్నట్లే తోస్తాయి — కాని ఏవీ ఆగవు — విచిత్రంకదూ."

"నీ బాధ నే అర్థం చేసుకోగలను." విచలిత స్వరంతో అంది శైల.

"నీకు తెలుసు — మనం అన్నీ అర్థంచేసుకో గలం. అందుకే మనల్ని మనం అర్థం చేసుకోలేక పోతున్నాం— యామై కరెక్ట్?" రిలాక్స్‌గా వెనక్కి వాలాను.

శైల లేచి నా దగ్గరకు వచ్చింది. నేను కళ్ళు మూసుకున్నాను. ఆమె వెచ్చటి వూపిరి నా మోహం దగ్గర ఏదో భాషలో మాట్లాడబోతుంది. ఆమె పెదవులు నా నుదుటిపై ఆనాయి. మస్సితమైన ఆ స్పర్శకి జివ్వున పొంగాయి నరాలు. రక్తం చిట్లి ఆవిరై పొంగింది.

"శైలా!" ప్రేమ మైకంలో పిల్చాను.

"వూఁ!" ఆమె నా చేతుల్లో సున్నితంగా బిగుసుకు పోయింది.

ఇద్దరం ఒకరి చేతుల్లో ఒకరు ఒదిగి, కౌగిలి బిగించి ... గట్టిగా బిగించిన తనువుల్లో ఎప్పుడో, ఏ మగతలోనో మేము పోగొట్టుకున్న కమ్మని తలపుల్ని ... ఆ వలపుల్ని ... ఇంకా నసిపోని ఆ స్మృతుల గుర్తుల్ని వెతుక్కుంటూ ... ఇద్దరం మంచంపై మధుర ప్రపంచాన్ని ఆవిష్కరించాం—

తెగిన మైకపు పొరల్లోంచి మేల్కొనేసరికి ... శైల చీర సవరించుకుంటోంది. నేను లేచి ఫ్లాస్క్‌లో ఉన్న కాఫీ రెండు భాగాలుకచేసి ఒక కప్పు ఆమెకు అందించాను. అందుకుంటూ నా కళ్ళలోకి చిలిపిగా చూసింది. నిండైన అవయవ పొందికతో అరుదైన అనుపమ సౌందర్యాన్ని నింపుకున్న శైలని ఎలా వదులుకోవటం ... ఎలా మరచిపోవటం ...

ఖాళీ కప్పుని టీపాయ్ మీద పెట్టి "శైలా! మనం ఇద్దరం ఒకరి నొకరు పరస్పరం ఆశించు కొంటున్నప్పుడు విధి మనల్ని విడదీసి చెరో పక్క దూరంగా విసిరేసింది. నీవు నన్ను ఆశించి నప్పుడు సమస్యలు నన్ను నీ నుండి తరమి తరమి కొట్టాయి. ఇప్పుడు శూన్యాన్నే నింపుకున్న నా జీవన పాత్రికలో నీ ప్రేమ రసాన్ని వంచ మంటున్నా నని, నీవు విదిలించి విసిరి కొట్టాలని మాత్రం చూడకు— నేనేమీ లేని ఏకాకిని. నా గమ్యాని కో పరిపూర్ణత ప్రసాదించు." తీరని నా ఆర్తి ఆవేదనై, లుంగలు చుట్టుకుంది మాటల వాక్యాలై.

చిన్నగా నవ్వింది శైల. మంచులో తడిసిన మల్లికలా నవ్వింది శైల. ఆడది నవ్వితే ఎన్ని అర్థాలు వస్తాయో అన్ని అర్థాలు వచ్చేలా నవ్వింది శైల. నా హృదయ నైవేద్యాన్ని అందుకున్న శైల చెరగని చిరునవ్వు మోహంతోనే నా అభిమానాన్ని, అనురాగాన్ని చిల్లులు పొడిచేలా మాట్లాడింది.

"నాకు ఇద్దరు పిల్లలు. ఆయన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఈ మధ్యే ప్రమోట్ అయ్యారు. ఇప్పుడు నీ మధురమైన ప్రేమారాధనకు నే నొట్టి ఆత్మార్పణ మాత్రమే ఇవ్వగలిగింది. ఇక నుండి అనుభూతుల్ని చెరిపేసి భవితవ్యంలో అనుభవాల్ని అందుకొనే ప్రయత్నం చేయి — ఒక్కటిమాత్రం నిజం—ఇక నా నీడ కూడా నిన్ను మళ్ళీ కలిసే ప్రయత్నం చేయదు. ఈ జన్మకు మనకు మిగిలింది ఇంతే—మనం మిగుల్చుకొన్నది కూడా ఇంతే— వస్తా—చాల రాత్రయింది" అంటూ నా చూపులు అందుకో లేనంత దూరం, నాజీవిత లోతుల చివర్లకులందనంత దూరం వెళ్ళిపోయింది శైల.

ఆ నిశ్శబ్ద నిశీధి పేటికలో గుండె తెరిచిన గీతాన్నై ... మళ్ళీ ఒంటరిగా మిగిలిపోతూ ... నేను.

*